క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ముస్లింల ఉపవాస దీక్షలు



గన్‌బజారులోని రైల్వేగేట్ మసీదులో జావ స్వీకరిస్తున్న ముస్లింలు

ఏలూరు(ఆర్‌ఆర్‌పేట): రంజాన్‌ను పురస్కరించుకుని రంజాన్ మాస ఉపవాస దీక్షలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం నాడే రంజాన్ మాసం ప్రారంభం కావడంతో అధిక శాతం ముస్లింలు తొలి రోజు ఉపవాస దీక్షల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. తెల్లవారు జామున 4.44 గంటలకు ఉపవాస దీక్షలు చేపట్టి సాయంత్రం 6.25 గంటలకు దీక్ష ఉపసంహరించుకున్నారు. నగరంలోని అన్ని మసీదుల్లో మసీదుల పేష్ ఇమామ్‌లు, మౌజన్‌లు నమాజు ప్రార్థనలు చేశారు. ఖుర్‌ఆన్ గ్రంథ పఠనం చేశారు. సాయంత్రం ఉపవాస దీక్షల ఉపసంహరణ ఇఫ్తార్ సందర్భంగా పలు మసీదుల్లో ముస్లింలకు ప్రత్యేక పోషక విలువలతో తయారు చేసిన జావ పంపిణీ చేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన



గాంధీ కాలనీలో డ్రైయినేజీ ఏర్పాటుపై వివరిస్తున్న కార్పొరేటర్ రాము

ఏలూరు రూరల్: ఎమ్మెల్యే ఆళ్లనాని సహకారంతో 15వ డివిజన్‌లో రూ.30 లక్షలతో రోడ్లు, డ్రైయినేజీ వ్యవస్థ మెరుగుపరచనున్నామని కార్పొరేటర్ తంగెళ్ల రాము తెలిపారు. శుక్రవారం ఆయన శానటరీ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథం, వైఎస్సార్‌సీపీ నాయకులు జి.గంగాధర్‌రావు తదితరులతో కలిసి గాంధీ కాలనీ, సుబ్రహ్మణ్యం కాలనీలో పర్యటించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా లక్షలాది రూపాయలు వెచ్చించి డివిజన్‌లో రోడ్లు, డ్రైయినేజీ, తాగునీటి పైప్‌లైన్ మౌలిక అభివృద్ధి చేశామని తెలిపారు. ప్రజలకు పారిశుద్ధ్యం సమస్య తీరిందని చెప్పారు. పైప్‌లైన్ లీకేజీకి అడ్డుకట్ట వేశామన్నారు. విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశామని తెలిపారు. డివిజన్‌లో అర్హతగల ప్రతి పేదవాడికి పింఛన్, ఇంటి స్థలం అందించామన్నారు.

సబ్ ప్లాన్ చట్టం పొడిగింపు తీర్మానంపై హర్షం

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టంను మరో పదేళ్లపాటు పొడిగిస్తూ తీర్మానం చేయడం పట్ల ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. దళిత క్రైస్తవులను ఎస్సీల్లో చేర్చాలని తీర్మానం చేసి కేంద్రానికి పంపనుండటం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు శుక్రవారం ఒక ప్రకటన అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీలపై జరగుతున్న దాడులపై సీఎం ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరారు. ఎస్సీల సంక్షేమం, అభివృద్ధికి సీఎం జగన్ కృషి చేయాలన్నారు. గతంలో ఎస్సీలకు సంబంధించి పలు పథకాలు అమలయ్యేవని వాటిని తిరిగి పునరుద్ధరించాల్సిందిగా కోరారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దుర్వినియోగం చేసే అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సీలపై దాడులను అరికట్టేందుకు, ఎస్సీలను అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కృషి చేయాలని కోరారు.

అగ్నివీర్‌కు దరఖాస్తు చేసుకోండి

ఏలూరు రూరల్: భారత వైమానిక దళం అగ్నివీర్–2023 పేరుతో కొత్త నియామకాలు చేపట్టిందని జిల్లా చీఫ్‌కోచ్ బి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. అవివాహిత పురుషులు, మహిళలు మాత్రమే అర్హులని, మార్చి 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరింత సమాచారం కోసం వైమానిక దళం అధికారిక అగ్నిపథ్ వెబ్‌సైట్ పరిశీలించాలని పేర్కొన్నారు.

ఆసరాతో అక్క చెల్లెమ్మలకు ఆర్థిక చేయూత

- ఏలూరు నియోజకవర్గంలో రూ.82.92 కోట్ల లబ్ధి
- సీఎం జగన్‌కు మహిళల కృతజ్ఞతలు
- నేడు మూడో విడత ఆసరా జమపై హర్షం



డ్వాక్రా సమావేశంలో పాల్గొన్న మహిళలు

ఏలూరు (టూటౌన్) : ఇచ్చిన మాట ప్రకారం ఎన్నికల ముందు నాటికి ఉన్న డ్వాక్రా మహిళల అప్పు మొత్తం మాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. ఆసరా పథకంలో భాగంగా నాలుగు విడతల్లో మాఫీ మొత్తాన్ని మహిళల ఖాతాలకు నేరుగా జమ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సీఎం వైఎస్ జగన్ తాజాగా శనివారం దెందులూరులో మూడోవిడతలో ఆసరా పథకంలో మహిళలకు సొమ్ము జమ చేయనున్నారు. మూడు విడతల్లో ఏలూరు నియోజకవర్గంలోని మహిళలకు మొత్తం రూ.82.92 కోట్లు మేర లబ్ధి చేకూరింది. మెప్మా పరిధిలో రూ.56.22 కోట్లు, డీఆర్‌డీఏ పరిధిలో రూ.26.70 కోట్లు చొప్పున మహిళలకు ఆర్థిక చేయూత అందింది. ఆర్థిక చేయూత అందించడం పట్ల మహిళలు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

మెప్మా పరిధిలో రూ.56.22 కోట్ల లబ్ధి

ఏలూరు కార్పొరేషన్ పరిధిలో మెప్మా పరిధిలో మూడు విడతల్లో కలిపి మొత్తం రూ.56.22 కోట్లు మేర లబ్ధి చేకూరింది. ఇందులో ఆసరా తొలి విడతలో 2,391 గ్రూపులకు చెందిన 20,789 మందికి రూ.18.61 కోట్లు ప్రయోజనం కలిగింది. రెండో విడతలో 2,420 గ్రూపుల్లో 21,150 మందికి రూ.18.91 కోట్లు ఆర్థిక సాయం లభించింది. తాజాగా మూడో విడతలో 2,406 గ్రూపులకు చెందిన 21,059 మందికి రూ.18.70 కోట్లు ప్రయోజనం కలుగనుంది.

డీఆర్‌డీఏ పరిధిలో రూ.26.70 కోట్లు లబ్ధి

డీఆర్‌డీఏ పరిధిలో కార్పొరేషన్‌లో కలిసిన ఏలూరు రూరల్ గ్రామాలకు చెందిన 1182 గ్రూపుల్లో 11,541 మంది సభ్యులకు మూడు విడతల్లో రూ.26.70 కోట్లు ఆర్థిక ప్రయోజనం కలిగింది. ఇందులో మొదటి విడతలో రూ.8.90 కోట్లు, రెండో విడతలో రూ.8.93 కోట్లు ఆర్థిక ప్రయోజనం చేకూరింది. మూడో విడతలో రూ.8.87 కోట్లు లబ్ధి పొందనున్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



ఎన్నికల నాటికి ద్రాక్షాయిని స్వయం సహాయక సంఘానికి రూ.6 లక్షల వరకు అప్పు ఉంది. ఈ మొత్తం మాఫీ కావడంతో ఒక్కో సభ్యురాలికి రూ.60 వేలు చొప్పున లబ్ధి చేకూరింది. ఒక్కో విడతలో రూ.15 వేలు చొప్పున రెండు విడతల్లో సొమ్ము అందింది. మూడో విడత శనివారం రూ.15 వేలు నా ఖాతాకు జమకానున్నాయి.

– మన్యం జ్యోతి, ద్రాక్షాయిని ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు, కొత్తపేట

ముఖ్యమంత్రి సాయం మరువలేం



నాకు రూ.48 వేలు లబ్ధి చేకూరింది. ఆసరా పథకంలో విడతకు రూ.12 వేలు చొప్పున లబ్ధి చేకూరింది. మూడో విడతలో మరో రూ.12 వేలు సాయం అందనుంది. ఆసరా మొత్తంతో నా కుటుంబ అవసరాలు తీర్చుకో గలిగాను. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునే విధంగా ఆర్థిక సాయం అందిస్తున్న వైఎస్ జగన్ మేలు మరువలేం.

– కొమ్మూరి అరుణ, శ్రీ కనకదుర్గా ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు, ఏకే సెంటర్

అర్హులందరికీ ఆసరా లబ్ధి



అర్హులయిన డ్వాక్రా మహిళకు ఆసరా పథకంలో లబ్ధి చేకూర్చేందుకు మెప్మా కృషి చేస్తున్నాం. ఏలూరు కార్పొరేషన్ పరిధిలో రెండు విడతల్లో రూ.37.52 కోట్ల సాయం అందించాం. మూడో విడతలో భాగంగా 2,406 గ్రూపుల్లో 21,059 మంది మహిళలకు రూ.18.70 కోట్ల లబ్ధి పొందనున్నారు. మహిళలు వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా నిలబడేందుకు ఆసరా దోహదం చేస్తుంది.

– బి.ఇమ్మానియేలు, పీడీ, మెప్మా, ఏలూరు

పేదలు, రైతుల సేవే సహకార సొసైటీ లక్ష్యం



జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ మహాజన సభలో మాట్లాడుతున్న చైర్మన్ వెంకట స్వామి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ద్వారా పేదలకు, రైతులకు సేవలందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని డీసీఎంఎస్ చైర్మన్ వేంద్ర వెంకట స్వామి అన్నారు. శుక్రవారం స్థానిక డీసీఎంఎస్ కళ్యాణ మండపంలో నిర్వహించిన మహాజన సభకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. మార్కెటింగ్ సొసైటీ ద్వారా రైతులకు సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. పేదలకు తక్కువ ధరలకే మందులు అందించే నిమిత్తం జనరిక్ మందుల దుకాణాలను జిల్లా వ్యాప్తంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. ప్రజలకు చవక ధరలకే నాణ్యమైన నిత్యావసర వస్తువులు అందించేందుకు సూపర్ బజారులు నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్ పాలనలో రైతులకు వివిధ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, రైతు భరోసా ద్వారా ఎన్నో రైతు కుటుంబాలు సంతోషంగా ఉన్నాయని వివరించారు. ఈ సందర్భంగా రూ. 4,80,76,000 స్థూల అంచనా వ్యయానికి మహాజన సభ ఆమోదం తెలిపింది. రూ.90,50,000 అంచనా నికర ఆదాయానికి సైతం ఆమోదం తెలిపింది. వీటితో పాటు పలు తీర్మానాలను మహాజన సభ ఆమోదించింది. సమావేశంలో మార్కెటింగ్ సొసైటీ డైరెక్టర్లు పి.సుబ్బరాజు, జేవీ కృష్ణారెడ్డి, బి.శ్రీనివాసరావు, పి.లక్ష్మి, టి.రాఘవులు పాల్గొనగా, కార్యక్రమాన్ని డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ వెల్లంకి శివ కృష్ణమోహన్ పర్యవేక్షించారు.

వ్యాధి నిరోధక శక్తి పెంచుకోవాలి



క్షయ నివారణ అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం

ఏలూరు టౌన్ : వ్యాధి నిరోధక శక్తిని పెంచుకుంటూ వైద్య చికిత్స, మందులు వాడుతూ ఉంటే క్షయను నివారించవచ్చని ఏలూరు జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి అన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఏలూరు ప్రభుత్వ బోధనాసుపత్రి ప్రాంగణంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో క్షయ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏలూరు ప్రభుత్వ బోధనాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేవీ విజయకుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఆశ, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఏవీఆర్ మోహన్ జెండా ఊపి క్షయ నివారణ అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి నుంచి కోర్టు సెంటర్, ఫైర్‌స్టేషన్ సెంటర్ మీదుగా ర్యాలీ కొనసాగింది. రెడ్‌క్రాస్ ఏఎన్‌ఎం విద్యార్థులు, రెడ్‌క్రాస్ సిబ్బంది ప్లకార్డులు పట్టుకుని ప్రజలకు అవగాహన కల్పించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ కృష్ణారెడ్డి 15 మంది క్షయ బాధితులకు నెలకు సరిపడా గుడ్లు, పాలపొడి, ఓట్స్, వేరుశనగ నూనె, గోదుమపిండి, పెసరపప్పు, కందిపప్పు వంటి పౌష్టికాహారంతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. రాష్ట్ర గవర్నర్, రెడ్‌క్రాస్ చైర్మన్ సయ్యద్ అబ్దుల్ నజీర్ సూచనల మేరకు జిల్లాలోని క్షయ బాధితులకు మూడు నెలలకు పౌష్టికాహారం అందజేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. దాతలు డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కే వరప్రసాద్, బి.పద్మజావాణి, డాక్టర్ జి.నవ్యకళ, వై.దెబోర, డాక్టర్ కె.శ్రీలక్ష్మి, రేవూరి శివప్రసాద్, కడియాల కృష్ణారావు, బీఆర్‌సీ హెచ్ నారాయణ, బి.చిరంజీవిరావు, కె.సత్యనారాయణ, ఆర్ఎస్ఆర్ నాగేశ్వరరావు, వై.ఉమారాణి, బి.శ్రీదేవి, ఆర్.కమలకు ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ రత్నకుమారి, రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, రెడ్‌క్రాస్ నర్సింగ్ సిబ్బంది, విద్యార్థినులు ఉన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు సత్రంపాడు విద్యార్థులు

ఏలూరు రూరల్: సత్రంపాడు జడ్పీ పాఠశాల విద్యార్థులు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు (ఎన్‌ఎంఎంఎస్) ఎంపికయ్యారని హెచ్‌ఎం రాయబారం జయరామం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయి ప్రతిభా అన్వేషణ పరీక్షలో భాగంగా ఈ ఏడాది ఫిబ్రవరి 5న జరిగిన పరీక్షలో సత్రంపాడు విద్యార్థులు పాల్గొన్నారు. నేడు విడుదలైన ఫలితాల్లో పాఠశాల పిల్లలు ఎనిమిది మంది ఉత్తీర్ణులయ్యారు. వీరికి ఒక్కొక్కరికీ ఏడాది రూ.12,000 చొప్పున నాలుగేళ్ల పాటు మొత్తం రూ.48,000 ఉపకారం ప్రభుత్వం అందించనుందని హెచ్‌ఎం తెలిపారు. గతేడాది ఇదే విధంగా ఎనిమిది మంది ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన సంగతి తెలిసిందే.

నేడు సౌత్ సెంట్రల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు

దెందులూరు: వేగవరం హేలాపురి ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శనివారం మధ్యాహ్నం నుంచి నుంచి జెఎన్‌టీయూ సౌత్ సెంట్రల్ క్రికెట్ పోటీలు ప్రారంభమవుతాయని కళాశాల వైస్ చైర్మన్ అరసవిల్లి అరవింద్, ఏఓ టీఎస్ కరుణానిధి అన్నారు. శుక్రవారం క్రీడాప్రాంగణాన్ని జేసీబీలతో చదును చేయించారు. ప్రకాశం, గుంటూరు, కృష్ణా, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని 70 టీమ్‌ల క్రీడాకారులు పాల్గొంటారని, రిజిస్ట్రేషన్ కార్యక్రమం పూర్తయిందని ప్రిన్సిపల్ రాధాకృష్ణ, ప్రొఫెసర్ శ్రీనివాసరావు వివరించారు.

ప్రాంతీయ సదస్సు పోస్టర్ విడుదల



వాల్‌పోస్టర్ విడుదల చేసిన నాయకులు

ఏలూరు(మెట్రో): సీపీఎస్‌ను రద్దు, డిమాండ్‌ల సాధనకు విశాపట్నంలో 26న నిర్వహించే ప్రాంతీయ సదస్సును విజయవంతం చేయాలని ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, కాన్ఫిడరేషన్ ఆఫ్ సెంట్రల గవర్నమెంట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ నాయకులు కోరారు. సదస్సు వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఏలూరులో వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా జేఏసీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా చైర్మన్ చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 26న విశాఖపట్నం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ నెరుసు రామారావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని కస్తూర్బా బాలికా విద్యాలయాల్లో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్వీ రవి సాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. కస్తూర్బా బాలికా జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో బైపీసీ, ఎంపీసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో ప్రవేశానికి అర్హత గల బాలికలు ఈ నెల 27వ తేదీ నుంచి ఏప్రిల్ 20 వరకు ఏపీకేజీబీవీ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. కుకునూరులోని కేజీబీవీలో బైపీసీలో 40 సీట్లు, కేజీబీవీ వేలేరులో ఎంపీసీలో 40 సీట్లు, కేజీబీవీ వేలేరుపాడులో హెచ్‌ఈసీలో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కేజీబీవీలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి ఉత్తీర్ణులైన అనాథలు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలు, తల్లిదండ్రులు వలస వెళ్లిన బాలికలు, పేదరిక రేఖకు దిగువన ఉన్న బాలికలు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని, ఎంపికైన వారికి ఫోన్ ద్వారా మెసేజ్ పంపతామని వివరించారు. మెసేజ్లు అందిన వారు ఆయా కేజీబీవీలకు వెళ్లి ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు కేజీబీవీ ప్రత్యేక అధికారులను ఫోన్ నెంబర్లు 94419 15166, 83741 72109, 89199 84331 ద్వారా సంప్రదించాలని సూచించారు.

పాఠశాలల్లో ప్రవేశాలకు..

జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి, 7, 8, 9వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. ఈ పాఠశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 20వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. ఈ ప్రవేశాలకు డ్రాప్ అవుట్ బాలికలు, బడి బయట పిల్లలు, అనాథలు, పాక్షిక అనాథలు, పీహెచ్‌సీలు, ఎస్సీ, ఎస్టీ మైనారిటీలు, తల్లిదండ్రులు వలస వెళ్లిన బాలికలు, పేదరిక రేఖకు దిగువ గాల బాలికలు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	24
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	35
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	21
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	17
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	23
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	35
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	20
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	22.15	34820	15
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	09.00	4794	31
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	19
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు – తిరుపతి	16.00	4830	33

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	05–07
వంకాయలు (గులాబీ)	18	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	20	చామదుంపలు	64
వంకాయలు (తెలుపు)	24	ములక్కాడలు	08–10
బెండకాయలు	40	కంద	46
పచ్చిమిర్చి	32	బీట్‌రూట్	36
కాకర కాయలు	24–30	కీరా దోస	30
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	76
బీరకాయలు (పందిరి)	50	అల్లం	100
క్యాబేజీ	18	కొత్తిమీర (కట్ట)	18
క్యారెట్	28	పాలకూర	10
దొండకాయలు	32	చుక్కకూర	10
బంగాళదుంపలు	20	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	08
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	24–34	బఠాణి	60
ఆనబకాయ (1)	12–15	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	26–30

ఆర్టీసీ బస్సును ఢీకొన్న డీసీఎం

క్యాబిన్‌లో ఇరుక్కొని ఒకరి మృతి



క్యాబిన్‌లో ఇరుకున్న క్షతగాత్రులను బయటకు తీస్తున్న పోలీసులు

చౌటుప్పల్ : ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును డీసీఎం ఢీకొట్టడంతో ఒకరు దుర్మరణం చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామ శివారులో గురువారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు రూరల్ మండలంలోని పైడిచింతలపాడు గ్రామానికి చెందిన సిర్లు బాలకృష్ణ(42) తన డీసీఎంలో కూరగాయలను లోడు చేసుకుని హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు వెళ్తున్న సత్తుపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ లింగోజిగూడెం శివారులోని ఓ హోటల్ ఎదురుగా ప్రయాణికుల మూత్ర విసర్జనకు బస్సును రోడ్డు పక్కన ఆపాడు. ఆ సమయంలో డీసీఎం వాహనం ఆర్టీసీ బస్సు వెనుక వస్తోంది. ఎలాంటి ముందస్తు సంకేతాలు ఇవ్వకుండా బస్సును నిలపడంతో డీసీఎం డ్రైవర్ శ్రీనివాస్ వేగంగా వెళ్లి వెనుక నుంచి దానిని ఢీకొట్టాడు. దీంతో డీసీఎంలోని ఇద్దరు క్యాబిన్‌లో ఇరుకున్నారు. తీవ్రంగా గాయపడిన బాలకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సీఐ మల్లికార్జున్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లారు. క్యాబిన్ నుంచి ఇద్దరిని బయటకు తీశారు. గాయపడిన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సులోని ప్రయాణికులు ఎవరూ గాయపడలేదు.